# గురజాడ అప్పారావు కథానికలు

శ్రీ దాశరథి

తెలుగులో అధునాతనరూపంలో కథానికారచనకు ఒరవడి పెట్టినది కీ. శే. గురజాడ అప్పారావుగారే. అధునాతనరూపమంటే - నవీన కాలంలో ఆంగ్ల, ఫ్రెంచి, రష్యన్ మున్నగుభాషలలో చిన్నకథ ఎలా వ్రాయబడుతున్నదో, దాని సాంఘిక ఇతివృత్తం ఎలా వుంటూందో, ఎత్తుబడి యే తీరులో వుంటుందో, నిర్మాణం ఎలా జరుగుతుందో, ముగింపు ఎలా చేయబడుతుందో, మొత్తంపై ఎట్టి స్వరూపంతో అది వుండవలసిందీ తాను గ్రహించి మనకు చూపెట్టినవారు అప్పారావుగారే. ఆంగ్లభాషా సాహిత్యముల తత్వమును కూలంకషముగా అవలోకించి అందలి లోతుపాతుల నరసి ఆ సారస్వత ముద్రను తెలుగువారికి విప్పిచెప్పినవారు ఆయన. అధునాతనరూపం అన్నమాటలో మరొక విశేషం కూడా వుంది. ఒకేతీరుగా అచ్చుపోసినట్లుండే పిట్టకథలు, పురాణకథలు, అద్భుతగాథలు వంటివిగాక ఒక కొత్త ఫక్కీతో వైవిధ్యంతో దేనికదిగావుండే కథనూ, ప్రయోజనం వుండే కథనూ సృష్టించింది అప్పారావుగారే. అవును, అసలు సాహిత్యప్రయోజనం విషయమై ఆయనకు నిర్దిష్టమైన అభిప్రాయాలున్నవి. ఒకటి సామాజిక వాస్తవికత. అటువంటి సామాజిక వాస్తవికతను గమనించకుండా ఏవో స్వప్నలోకాలలో పుక్కిటి పురాణాలలో పడి కొట్టుకుపోవడం ఆయనకు ఇష్టములేదు. అతి క్లిష్టమైన అనేక సాంఘిక పరిస్థితులను మనముందుకు తెచ్చిపెట్టిన ఆధునికజీవితం ఆయనకు కథావస్తువూ కావ్యవస్తువూ. కనుకనే మన సాహిత్యంలో వాస్తవికతను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కింది. రెండవది- జీవితాన్ని ఆయన నూత్న దృక్పథంతో దర్శించి కథా, కవితా రూపంలో దాన్ని మనకిచ్చిపొయ్యారు. ఆయనకు జీవితంపట్ల కొన్ని ఆదర్శాలు వున్నాయి. సంఘంపట్ల తనకు కొంత బాధ్యత వున్నదని గుర్తించి రచనలు చేసిన వ్యక్తి ఆయన. కనుకనే అనేక చెడుగులతో కుళ్లిపోయి వున్న మన సంఘాన్ని సంస్కరించవలసిన అవసరాన్ని ఆయన గ్రహించారు. సంఘ సంస్కరణము సామాజికజీవితమును పురోగమింపజేయడం కోసం ఆయన కలం చేతపట్టారు. సంస్కరణ జరగాలంటే కంటిఎదుట స్పష్టంగా కన్పిస్తూవున్న వాస్తవ విషయాలకు భయపడి సత్యాన్ని మరుగుపుచ్చి తప్పించుకు తిరగడంవల్ల ప్రయోజనం శూన్యమని ఆయన బాహాటంగా చెప్పారు. కనుకనే సంఘంలో వ్యాపించివున్న దురాచారాలను ఖండించడంకంటే సాహిత్యం చేయగలిగిన గొప్ప కార్యం మరొకటి

లేదని ఆయన విశ్వాసం. మూడవది జీవితంపట్ల ఆయనకు కొన్ని ఆదర్శాలు వున్నట్లే కళలపట్ల కూడా ఆయనకు పరిణతాభిప్రాయా లున్నవి. భావించడం ఆయన ముచ్చట. యే సాహితీరూపం పరిమితి ఎంతో, దేని ప్రయోజన మెంతో ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. ఒక్కొక్కప్పుడు కొన్ని రూపాల సమ్మేళనంతో ఎలాంటి ఫలితం - సాధించాలో సాధించారు. ఇక చెప్పేది ప్రభుసమ్మితంగా వుండాలా, కాంతా సమ్మితంగా వుండాలా అన్న తర్కవితర్కాలను అవతలికి నెట్టి ప్రజాసమ్మితంగా చెప్పండి, మెత్తగా, అందంగా చెప్పండి, ఆధునిక కళ అంటే అదే అని తన తరువాత రాబోవుతరం వారికి అప్పారావుగారు పిలుపు యిచ్చారు. ఈ విశేషా లన్నింటి పర్యవసానంగా ఆయన కథానికలు రూపొందాయి. తెలుగులో ఆధునిక కథానికకు ఆయన ఆద్యులుగా నిలిచారు.

అప్పారావుగారు వ్రాసిన కథానికలు—అనగా ఇంతవరకు మనకు లభించినవి సరిగా అయిదు. ఇంకా ఏమైనా వ్రాశారో లేదో, వ్రాస్తే అవి ఆయన అముద్రిత రచనలు కొన్ని పోయినట్లుగా అవీ పొయ్యాయో ఏమో తెలియదు. అయితేనేమి ఒక్కొక్కటి ఒక కళాఖండం. సంస్కృతంలో పంచకావ్యాలు చదివితే తగు పరిజ్ఞానం కలిగినట్లే ఈ అయిదు కథలు చదివిన పిమ్మట మనం పందొమ్మిదవ శతాబ్ది చివరి అంకంలో తెలుగునాటి సాంఘిక జీవిత నాటకం యే స్థితిలో వుండేదో తెలుసుకో గలుగుతాము.

అప్పారావుగారి కథలలో రెండు కథలు మతముల గొడవకు సంబంధించినవి. ఆంధ్రదేశంలో శైవ, వైష్ణవ విభేదాలు, హిందూ ముస్లిం స్పర్ధలు అంతా ఎరిగినవే. ఈ రెండింటిని గురజాడవారు, 'మీ పేరేమిటి?', 'పెద్దమసీదు' అను కథలలో చిత్రించి ఒక్కొక్క తెగవారు మూఢ విశ్వాసాలకు లోనై ఎలా ప్రవర్తిస్తారో నిశితమైన వ్యంగ్య వైభవంతో చక్కని హాస్యధోరణిలో రచించారు. మతముల విషయంలో అప్పారావుగారి అభిప్రాయాలు మనకు తెలుసు. 'మతము లన్నియు మాసిపోవును - జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును' అని ఆయన ముత్యాలసరంలో చెప్పారు. 'దేశభక్తి' గీతంలో 'అన్నదమ్ములవలెను జాతులు, మతము లన్నియు మెలగవలెనోయ్' అని ప్రబోధించారు. వారి మిత్రులకు వ్రాసిన లేఖలలో, 'మతవిశ్వాసాలనేవిఆచరణకుఅసాధ్యమైనవి. గుదిబండల వంటివి. మానవుని ప్రేమించడమన్నది అతి సాధారణమైన జీవిత సూత్రం' అని ఉద్ఘాటించారు. ఇది తెలుసుకోకుండా అంధ విశ్వాసాలలో పడి ప్రజలు తమ శక్తి యుక్తుల నెలా వ్యర్థపుచ్చుతున్నారో, ఎలా ప్రవర్తిస్తున్నారో అధిక్షేపణ తీరులో ఆయన ఎత్తి చూపారు. 'మీ పేరేమిటి?' అను కథలో— ఒక గ్రామంలో శైవ వైష్ణవ మతాలకు చిరకాలం నుంచి వైరం వుంది. శైవమతానికి మొనగాడు జంగం శరభయ్య. వైష్ణవపక్షానికి కెప్టెన్ సాతాని మనవాళ్లయ్య. శైవులు శరభయ్యను సాక్షాత్తు వృషభావతారమనుకుంటూ వుంటే, మనవాళ్లయ్య తాను గరుడాళ్వారుయొక్క అత్యల్పాంశ అయినా కాకపోతానా అనుకుంటూవుంటాడు. ఇలావుండగా ఆ వూరికి శివాచార్లువచ్చి గుండందూకి వైష్ణవులను శైవులుగామార్చుతూవుంటాడు. మనవాళ్లయ్యదీని నెదుర్కోవాలని నడుము కడతాడు. కానిగుండంలో దూకే దమ్ములు ఎవరికీ లేవు. చివరకు స్వామివారి తిరునామమే పీరు అనుకొని పీరుసాయబు చేత గుండం తొక్కించ నిర్ణయిస్తారు. శైవులలో, వైష్ణవులలో కొందరికి యత్కించిత్ కాళ్లు కాలతాయి. అది భక్తిలోపమని సరిపెట్టుకుంటారు.

ఈ కథ అంతా విన్న గురువుగారు, వారి శిష్యులు ఒక్కొక్కచోట అన్న మాటలు కథ వ్రాయడంలో రచయిత కున్న ఉద్దేశములను ఆయన చెప్పదలచుకున్న అంశములను వెల్లడిచేస్తాయి. గురువుగారు, 'శివుడన్నా, విష్ణువన్నా, బుద్ధుడన్నా ఆ పరమాత్మ మట్టుకు ఒక్కడే కదా' అని అంటే స్కూలు మేష్టరు వెంకయ్య, 'అయితే ఆ పీనుగుల్ని అందిరినీ ఒక్కచోటే నిలిపి అందరూ కలిసి పూజ తగలెట్టరాదా' అంటాడు. భారతీయుల మూఢ విశ్వాసాలను అవహేళనచేస్తూ రచయిత ఒకచోట, 'ఈ దేశంలో పాండవులు వుండని గుహలు, సీతమ్మవారు స్నానమాడని గుంటలూ లేవు' అంటారు. అన్నిటి కన్న ఈ కథలో గల అద్వితీయమైన ప్రత్యేకత యేమిటంటే ఇంతచిన్న కథలో మనకు వూరువూరంతా దిఙ్మాత్రంగా గోచరిస్తుంది. రకరకాల మనుషులు కనిపిస్తారు. శరభయ్య, మనవాళ్లయ్య, లక్షాధికారి సారథినాయుడు, పులిహోరకోసం వైష్ణవం పుచ్చుకొన్న అతని బావమరిది గ్రామ మునసబు రామినాయుడు, అయ్యవార్లంగారు, రామానుజయ్య, నాంచారమ్మ, అటకెక్కి దాక్కున్న కృష్ణమాచార్యులు, పీరుసాయబు—అంతా మచ్చు తునకల వంటి పాత్రలు. దృక్పథంలో చివరకు నీతిలో ఈ కథలో సార్వజనీనత మనకు కన్పిస్తుంది. కథంతా చెప్పి అందులోని మనుషులను, దేవుళ్ళను, దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషులుచేసిన దేవుల్లారా, మీ పేరేమిటి ?' అని రచయిత నిలవదీసి అడిగారు. అంతర్జాతీయ భాషలలోకి అనువదించి ప్రపంచ మతాల మహాసభలో పీఠాధిపతులకు వినిపించవలసిన కథ యిది.

అల్లే, 'పెద్దమసీదు' అను కథలో హిందూ, ముస్లిం విభేదాలవల్ల దేవుళ్ళకి వచ్చే పాట్లను పరిహసించారు. నారాయణభట్టు, పుల్లంభట్టు బహుకాలం తరువాత కాశీనుండి స్వగ్రామమగు శ్రీకాకుళం చేరుకుంటారు. వచ్చి చూస్తే వూరి కోవెల గోపురం మాయమైంది. మహమ్మదీయులు ఆ గోపురం పడగొట్టి మసీదు కట్టించారు. ఆ మసీదులో యాభైయేండ్ల వయస్సుగల తురక చిలుము పీల్చుకుంటూ వుంటాడు. వెళ్ళి పలకరిస్తే అతను ఎవరో కాదు, నారాయణభట్టుకు మేనమామ. ఈ కథలో సంభాషణలు ప్రధానమైనవి. గోపురం పోయింది కాబట్టి, ఆ వూరికీ తనకూ రుణం చెల్లిపోయిందని నారాయణభట్టు అంటే, పుల్లంభట్టు, 'గోపురం కోసమా ఇక్కడికి వచ్చారు స్వామీ' అని అడుగుతాడు. 'మ్లేచ్ఛుడు గుడి పగులగొట్టి మసీదు కడితే దేవుడెందుకు వూరుకున్నాడు స్వామీ' అని పుల్లంభట్టు అడిగితే, 'ఆమాటే యే శాస్త్రంలోనూ కనబడదురా' అన్న సమాధానం వస్తుంది. చివరకు, 'దేవుళ్ళ కేమిపాట్లు వొచ్చాయి'యని నారాయణభట్టు విస్తుపోతూంటే, 'దేవుళ్ళకి యే పాట్లూ లేవు. మన సాపాటు మాట అలోచించరేం' అంటాడు పుల్లంభట్టు. దీనినిబట్టి అప్పారావుగారు నాస్తికులని ప్రచారం చేయడం శుద్ధ అబద్ధం కాగలదు. 'మతం వేరైతేను ఏమోయ్, మనసు లొకటై మనషులుంటే' అన్న వారాయన. మనిషికీ దేవుడికీ మధ్య ఈ తంతులు, తతంగాలు, గుర్తులు, గొడవలు, వైషమ్యాలు ఆయనకు నచ్చలేదు. వారి అల్పత్వమును, నిరర్థకతను బహిర్గతం చేయడానికే ఆయన ఈ రెండు కథలూ వ్రాశారు. వాటిని ఆయన వ్రాసి ఇప్పటికి అర్థశతాబ్ది గడచినా ఇప్పటికీ వాటిలో కన్పించే కొత్తదనాన్ని అవలోకిస్తే సామాజిక వాస్తవికతకు కళారూపమివ్వడం ఎంత పనో తెలిసివస్తుంది.

మన సమాజం అచ్చమైన ఫ్యూడల్ వ్యవస్థలో వున్నప్పుడు—అంటే వర్గాలు ప్రబలి, అంతస్థులు

బలిసి, మానవత్వం అతి హీనస్థాయిలో వున్నప్పుడు, సమాజంలో స్త్రీలంటే ప్రతిపత్తి లేనప్పుడు, ఇమ్మోరల్ ట్రాఫిక్ ఆక్టు రాకముందు పురుషుడి అతిసంచయేచ్ఛకు వేశ్యలను చెలామణీలోకి తెచ్చారు. అది రానురాను మరీ హేయమైన వ్యవస్థగా తయారైంది. మానవత్వపు విలువలను తెలుసుకున్నవారు దానిని గర్హించారు. ఆంగ్ల విద్యాభూషితులైన వారు దానిని "నాచ్ కొశ్చన్" అనేవారు. పురుషులలో 'ప్రోనాచీయులు, ఆంటీనాచీయులు' అని రెండువర్గా లేర్పడ్డవి. ఈ రెండు వర్గాలకు చెందకుండా మధ్యస్తంగా వుండే మరొకవర్గం కూడా తయారైంది. వీరు పగలు ఆంటీనాచి, రాత్రి ప్రోనాచీ. ఇదిగో ఈ వర్గానికి చెందినవాడు, 'దిద్దుబాటు' అను కథలో నాయకుడు గోపాలరావు. అతను వివాహితుడు. భార్య అంటే ప్రేమ, అభిమానం కలవాడే. కాని సానిదాని పాటసరదాలో మనసు లగ్నమైపోయింది. రాత్రులు ఆలస్యంగా దొంగతనంగా ఇంటికి చేరుకుంటూవుంటాడు. అతని భార్య కమలిని అతనికి బుద్ధిచెప్పి దిద్దవలెననుకుంటుంది. ఒకరోజు రాత్రి అతను ఇంటికి వచ్చేసరికి కమలిని కన్పించదు. అతను కంగారు పడతాడు. నౌకరు రాముడు ఆమె పుట్టింటికి వెళ్ళిపోయిందని చెబుతాడు. భార్య పుట్టింటికి వెళ్ళిపోయిందని తెలుసుకున్నప్పుడు తప్పుచేసి పశ్చాత్తాపపడే భర్త వైఖరిని అప్పారావుగారు ఈ కథలో రసవత్తరంగా చిత్రించారు. గోపాలరావు, రాముణ్ణి ఆమె పుట్టింటికి వెళ్ళి తీసుకురమ్మని చెబుతూ, ఆమెకు వాడు ఏమేమి మాటలు చెప్పవలసిందీ తానే చెబుతాడు. ఈ సమయానికి మంచంక్రింద దాక్కున్న కమలిని అమృతనిష్యందిని యగు కలకల నగవు, కరకంకణముల హృద్యారావము వినిపిస్తుంది. కథానాయకుడు 'అమ్మయ్య'అని సేద దేరుకుంటాడు. ఈ కథలో స్త్రీయొక్క విలువ, స్త్రీ విద్యను గూర్చి ప్రస్తావన కథానాయకుడికీ నౌకరుకూ మధ్య జరిగిన సంభాషణలో వస్తుంది. నౌకరు రాముడు, 'ఆడారు చదువు నేరిస్తే యేటౌతది. ఆడది చెప్పకుండా పుట్టినారింటికి యల్తానంటే చెంపలాయించి కూకోబెట్టాలిగాని మొగోడిలాగ రాతలూ, కోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదా బాబూ!' అంటే కథానాయకుడు, 'ఓరీ, మూర్ఖుడా! భగవంతుడి సృష్టిలో కెల్లా ఉత్కృష్టమైన వస్తువు విద్యనేర్చిన స్త్రీరత్నమే' అని చెప్పి స్త్రీవిద్యకు గల విలువను విశదం చేశారు. యుగపురుషుడు వీరేశలింగం పంతులుగారి సంఘ సంస్కరణోద్యమానికి ఇటువంటి రచనలు ఎంత చేయూతగా వుండేవో వేరే చెప్పవలసిన పనిలేదు.

'మెటిల్డా' అనేది వయసు పెళ్ళాం ముసలి మొగుడు కథ. ఇలాంటి ఈడుకాని పెళ్ళిళ్ళు ఆ కాలంలో అతి తరచుగా జరుగుతూ వుండేవి. మెటిల్డా అందమైన యువతి. ఆమె మొగుడు యాభైయేళ్ళ పైబడ్డవాడు. పైగా ఆమెను లావు కాయిదా పెడతాడు. చివరకు తాను ఆమెను పెళ్ళాడి అలాకాయిదా చేయడం అసమంజసమని తెలుసుకొని ఆమెను అదేపనిగా చూచే కాలేజీ కుర్రవాడితో, "ఈముండని తీసుకు పో. నీకు దానం చేశాను" అంటాడు. అతను తీసుకు పోడు. ఆమె పోదు. అమె వ్యక్తిత్వమే లేకుండా అయిన స్త్రీ. అప్పారావుగారు మన సమాజంలో వివాహ వ్యవస్థ తీరు తెన్నులనూ స్త్రీల దుర్భరజీవితాన్ని పరిశీలించి 'మెటిల్డా' కథ వ్రాశారు. 'ఈ సమాజంలో స్త్రీల కన్నీటి గాథలకు కారణం నాకు తెలుసును. తిరిగి వివాహ మాడకూడదనే నియమం, విడాకుల హక్కులేని కారణం, ఆర్థికస్వాతంత్ర్యం లేకపోవడం స్త్రీల కన్నీటి గాథలకు హేతువులు'

అని వారిమిత్రునికి స్పష్టంచేస్తూ, "మట్టూ కన్పిస్తూ వున్న వైవాహిక జీవితాన్ని పరిశీలించు. ఆడవాళ్ళు బానిసలుగా పడివుంటున్నారు" అని దేశీయులకు చెప్పారు. అటువంటి స్త్రీలకు ప్రతినిధి మెటిల్డా. ఆమె మూర్తిని వర్ణిస్తూ 'నా కళ్ళకి కట్టినట్లు ఆ వొంచిన మొఖం, బిందువులుగా స్రవించిన కన్నీరు, ఆచుకున్న నిట్టూర్పులచేత కంపించిన రొమ్ము యే మహాకవి రచనల్లోనూ లేదనగలను, అగాధమై, ప్రౌఢమైన కరుణరసం' అని చెప్పారు. ప్రతిభావంతుడైన కళాస్రష్ట వెయ్యిమంది ఉద్యమ నిర్వాహకులు చేసే పనిని తన ఒక్క రచనలో చేస్తాడనడానికి 'మెటిల్డా' కథ చక్కని నిదర్శనము.

అప్పారావుగారికి భారతదేశ కథకులలో అగ్రేసరత్వ మివ్వడమే గాక ప్రపంచ ప్రసిద్ధ కథా రచయితల సరసన నిలబెట్టగల కథానిక, "సంస్కర్త హృదయం." అసలు దీనిని వారు "Stooping to Raise" అను శీర్షికతో ఆంగ్లములో రచించారు. వారి రచనల సంకలనము చేసిన శ్రీ అవసరాల సూర్యారావుగారు ఈ పేరుతో దానిని తెనిగించి తెలుగు పాఠకుల కందజేశారు. ఒకరిని లేవనెత్త బోయి తానే క్రిందపడ్డ ప్రొఫెసరు కథ ఇది. ఒక పట్నంలో పడుపువృత్తి నిర్మూలనోద్యమం ముమ్మరంగా సాగుతోంది. ఆవూరి కాలేజీలో ప్రొఫెసర్ రంగనాథయ్యరు వివాహితుడు. మంచి సంస్కారి. ఉన్నత భావోద్రేకి. సంఘ సంస్కరణోత్సాహి - పడుపువృత్తి నిర్మూలనం గూర్చి అనర్గళంగా ఉపన్యాస మివ్వగలవాడు. ఆవృత్తిని నిర్మూలించవలెనన్న పట్టుదల గలవాడు. అంతేకాదు, గ్రీకుల వంటి సౌందర్యారాధకుడు. అయితే ఆయనకు జీవితంలో ప్రత్యక్షానుభవం లేదు. తన చదువూ తనూ తప్పిస్తే మరో ప్రపంచం ఆయనకు తెలీదు. గురువుల బోధలను యథాతథంగా స్వీకరించాడు. పుస్తకాలలోని రెడీమేడ్ అభిప్రాయాలను సిద్ధాంతాలుగా స్వీకరిస్తూ ఆ ఆలోచనల వాతావరణంలో మసిలేవాడు. కొన్ని సిద్ధాంతాలు, నమ్మకాలు ఆయనకు వున్నాయి. కాని అవి అనంతమైన జీవిత సంఘర్షణనుంచి జనించినవి కావు. కనుక అవి బలీయమైనవి కావు. సరళ అనే అందమైన బోగం పిల్లను సంస్కరించాలనుకున్నాడు. కాని ఆమెను చూచేసరికి నిగూఢమైన ఒక కోరిక ఆయనకు పుట్టుకొచ్చింది. సామాన్యంగా కొందరు దీనిని సౌందర్యారాధన క్రింద జమ కట్టి తప్పులేదులే అనుకుంటారు అటువంటివారికి అప్పారావుగారు, మెటిల్డా కథలోనే ఒక పాత్రచేత హెచ్చరిక చేయించారు. 'చెడ్డతలంపు చెప్పిరాదు, మనసులో ప్రవేశించి పొంచి వుంటుంది. మనం వూరుకోని అది పైకొచ్చే ప్రయత్నాలు బాహాటంగా చేస్తూ వుంటాము. సొగసైన స్త్రీల పొందు కోరేవాడికి అవకాశం తటస్థించినప్పుడు చెడ్డతలపు వస్తుందా రాదా? ఆ అవకాశం ఇవ్వనివాడే ప్రాజ్ఞుడు.'— ఇది ఆ హెచ్చరిక. చీకటివేళ ప్రొఫెసర్ సరళయింటికి వెళ్ళాడు. ఆమె అతనితో ప్రపంచపు పొలిమేరలకైనా పయనించడానికి సిద్ధం అంటుంది. ఉద్రేకంతో పులకాంకితుడై అతను ఆమె పెదవులను ముద్దుపెట్టుకున్నాడు. వెంటనే తాను పప్పులో కాలు వేసినట్లు గ్రహించాడు. మోసం జరిగిందని అరిచాడు. చివరకు కాలేజీ ఉద్యోగం వదలుకొని ఆవూరు విడిచి వెళ్ళాడు.

గురుజాడ కథలలో ఇది మకుటాయమానమైనది. కథాకథనం నిపుణంగా సాగింది. ముఖ్యంగా సరళ గదినీ ఆమె తల్లి గదినీ కథకుడు వర్ణించిన తీరు, వాటి రెంటికీ గల వ్యత్యాసంతో వారిద్దరి వ్యక్తిత్వాల మధ్య గల భేడాను రచయిత చూపెట్టిన తీరును, పరిశీలిస్తే బాల్జాక్, చెకోవ్

వంటి కథక చక్రవర్తుల ప్రతిభ గుర్తుకు వస్తుంది. సంఘ సంస్కర్త అయినవాడు సౌందర్యారాధనలో పడి మానసిక దౌర్బల్యమునకు లోనైతే ఏమవుతుందో ఈ కథ నిరూపిస్తున్నది. పడకకుర్చీ రాజకీయవాదులవలెనే పడకకుర్చీ సంస్కర్తలుంటారు. వాళ్ళకి సాధ్యాసాధ్యాలు తెలియవు. భోగం పిల్లను పట్టుకొని, 'నిన్ను ప్రేమించేవారెవరూ లేరా, వుంటే పెళ్ళిచేసుకో' అంటే సమస్య పరిష్కారమైనట్లేనా? సామాజిక వాస్తవస్థితినిగ్రహించండని గురజాడ సంస్కర్తలను హెచ్చరించారు ఇంతచేసీ రంగనాథయ్యరు పాత్రపై పాఠకుడికి చులకనకలుగదు. జాలి కలుగుతుంది. ఆయన ఆవూరు వదిలివెళ్ళాడని చెప్పినప్పుడు ఆ వూరిలోని యువకులతోపాటు మనమూ విచారపడతాము. అలాగే సరళకు ఆశాభంగం కలుగడం జాలి కలిగించే విషయం. ఇంతటి ఆవేశంతో నడిచిన కథతో అప్పారావుగారు ఒక్క సూక్ష్మాంశమును ప్రస్తావించి అలనాటి 'ప్రోనాచీ' స్థితిని బహు వ్యంగ్యంగా వ్యక్తంచేశారు. ప్రొఫెసర్ సరళ యింటికి వెడుతున్నారు. 'ఆమె యింటిముందు ప్రత్యేకం చైర్మన్ స్నేహితుడు వేయించిన వీధి లాంతరు వెలుగుతోంది' అని వ్రాశారు. అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకంలో రామప్పంతులు తరచు 'అది వేరేకథ' అంటూవుంటాడు. అదిగో అలాంటి వేరే కథ ఈ ఒక్క వాక్యంలో వుంది.

కథానికయొక్క స్వభావమును, దాని పరిమితిని ప్రయోజనమును అప్పారావుగారు ఆకళింపుచేసుకొని రచనలో వైశిష్ట్యం కనపరచినట్లు ఆయన రచించిన యే కథను చదివినా మనకు తెలుస్తుంది. కథ వ్రాస్తూపొయ్యేప్పుడు పూర్వరంగమును ఎంతవరకు చెప్పి ప్రస్తుత కథను ఎక్కడ ఆరంభించాలో మధ్య మధ్య రామాయణంలో పిడకలవేటలా వేరే కథలు ఎక్కడ ప్రస్తావించాలో ఆయనకు తెలిసినంతగా మనకు ఈనాటికీ తెలియవు. 'మీ పేరేమిటి?' అనేకథలో, 'ఇక ప్రస్తుత కథ. మా పట్నానికి ఎనిమిది మైళ్ళ దూరంలో రామగిరి అని ఒక విష్ణుక్షేత్రం వుంది. దానివర్ణన మరి 'వకమాటు చేస్తాను. ఇప్పటిమట్టుకు మీకు తెలియవలసినదేమంటే...' అంటాడు. ఇలా కథానిక టెక్నిక్‌కు సంబంధించిన అంశాలను ఆయన కథలలో పలు తావుల చూపవచ్చు. అప్పారావుగారు నవ్యకవిత, నాటకం అను రెండు శాఖలలో ప్రత్యేక ప్రతిభ గలవారు. అవి రెండూ ఆయన కథానికలలో నుంచి తొంగిచూచి మనకు దర్శనమిస్తూవుంటాయి కొన్ని వర్ణనలలో - ముఖ్యంగా స్త్రీలను వర్ణించిన పట్టుల కవిత్వం కురిపిస్తారు. ఇక కథలలో నాటకీయత విస్తారంగా ద్యోతక మవుతుంది. కథారంగంలోకి పాత్రలను నాటకంలో లాగా ప్రవేశపెట్టుతారు. అటువంటి కొన్ని తావులలో సంభాషణలతోటే కథ అంతా నడుస్తుంది. తాను చెప్పదలచుకున్న అంశములను, వాటికి వచ్చే శంకలను పాత్రలతోటే చెప్పిస్తారు. 'దిద్దుబాటు' అనే కథను సంభాషణలవరకే వుంచితే అది సమగ్రమైన ఏకాంకిక అవుతుంది. ఏ పాత్రకు ఆ పాత్ర అంత నిర్దుష్టంగా తీర్చిదిద్దినట్లుగా వుంటాయి.

వ్యావహారికభాషలో రచనలు చేయడం గురజాడవారి లక్ష్యం. వ్యావహారికభాష అంటే కేవలం మనం సాధారణంగా మాట్లాడుకొనేభాషమాత్రమే కాదు. ఎక్కడెక్కడి నానుడులను, పలుకుబడులను ఆయన ఒక్కొక్కచోట ఎంతో చమత్కారంగా ప్రయోగించి రచనకు మెరుగుపెట్టి రసపుష్టిని చేకూరుస్తారు. 'కన్యాశుల్కం' వ్రాసిన రచయితకు అటువంటి పదములు, ప్రయోగాలు కొల్లలు. మరీ కొన్నికొన్ని మాటలు పాటలవలె

జ్ఞాపక ముండిపోతాయి. అధునాతన కథానిక విశిష్ట పరిభాషకు పునాదులు వేసింది అప్పారావు గారే. అంటే సామాన్యంగా కథకులు వాడే పడికట్టు మాటలు ఉపమానాలు ఉదాహరణకు- "గదినీ అతని మనస్సునూ కూడ చీకటి కమ్మెను", "ఆవిడ తలలో అన్నీ సందేహాలే - సరస్సులో వికసించే వసంతకాలపు పద్మాలవలె...".

అడుగడుగునా సామాజిక విమర్శనముతో, వాస్తవమైన ఇతివృత్తాలతో, సంఘములోనుంచి ఎంచి తీసిన పాత్రలతో, చక్కని తేటైన తెలుగు నుడికారంతో, సున్నితమైన హాస్యంతో, నిశితమైన వ్యంగ్యంతో, సిద్ధాంతాల కతీతమైన శిల్పచాతుర్యంతో అలరారే గురజాడ అప్పారావుగారి కథలు ఆంధ్రకథాసాహిత్యానికి అచ్చంగా ఆణిముత్యాలే.

Source: A.P. Press Academy Website

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/